# గుట్టలో వైభవంగా ధ్వజారోహణం

### నేటి నుంచి స్వామివారి అలంకార సేవలు

యాదగిరిగుట్ట, మార్చి 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహస్వామి బ్రహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు గరుత్మంతుడిని వియుక్తం చేసే ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం చేపట్టారు. ప్రధానాలయం ముఖ మండపంలో ధ్వజస్తంభంపై ధ్వజారోహణం, అష్టదిగ్బాలక బలిహరణ కార్యక్రమా లు చేపట్టారు. గరుత్మంతుడి పటాన్ని శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ గరుడ పతాకాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించారు. స్వామివారిని పెండ్లి కొడుకును చేసి 33 కోట్ల దేవతలు, 33 కోట్ల పితృదేవతలు, 33 రాగాలు, 33 తాళాలు, 33 వేదమంత్రాలతో భూలోకానికి

ధ్వజారోహణం సందర్భంగా గరుడ ముద్దలు ఎగురవేస్తున్న అర్చకుడు

ఆహ్వానించారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహోత్సవాలలో భగవానుడిని వేడుకుంటూ ఈ పర్వాలు నిర్వహించారు.

# ఆసిఫాబాద్ అడవుల్లో బసాల్ట్ శిలలు

హైదరాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధారి అటవీ ప్రాంతంలో మినీయేచర్ (లఘు) కాలమ్నార్ బసాల్ట్ శిలలు బయటపడ్డాయి. పబ్లిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ అండ్ హెరిటేజ్ (ప్రిహ్)కు చెందిన పరిశోధకుడు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తోడిశెట్టి ప్రణయ్ వీటిని కొనుగొన్నారు. అరున్నర కోట్ల ఏండ్ల క్రితం భూగర్భం నుంచి బయటకు ప్రవహించిన లావా చల్లారినప్పుడు ఏర్పడిన శిలలనే కాలమ్నార్ బసాల్ట్ శిలలు అంటారు. ఇప్పటివరకు రాష్ట్రంలో బసాల్ట్ శిలలను గుర్తించినప్పటికీ మొదటిసారి మినీయేచర్ శిలల్ని ఇక్కడే కనుగొన్నట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చకిలం వేణుగోపాల్‌రావు తెలిపారు. గతంలో కొన్నిగొన్న ప్రాంతాలకు, ఈ ప్రాంతానికి మధ్య ఉన్న తేడాలను అధ్యయనం చేయాలని, దీంతో తెలంగాణలో లావా ప్రవహించిన తీరుతెన్నులు తెలు

స్తాయని తెలిపారు. అమెరికాలోని కొలంబియా నది ప్రాంతంలో, ఐస్‌ల్యాండ్, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లో కూడా ఇటువంటి శిలలను గుర్తించారు. కుజ గ్రహంపై ఉన్న ఈ బసాల్ట్ శిలలు మన భూమిపై ఉన్న శిలలకంటే పాతవని 2007లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా గుర్తించింది.

# యురేనియం సర్వే జరపలేదు

### మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు వెల్లడి

రామగిరి, మార్చి 12: నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం నల్లమల పరిధిలోని పెద్ద గట్టు, సాంబాపురం ప్రాంతాల్లో యురేనియం సర్వే జరుపలేదని మైన్స్ అండ్ జియాలజీ నల్లగొండ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న పీఏపల్లి తహసీల్దార్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశామని, గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు కూడా యురేనియం అన్వేషణ లేదని స్పష్టంగా చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. యురేనియం తవ్వకాలు వద్దంటూ 2019 సెప్టెంబర్, 2022 సెప్టెంబర్‌లో శాసన సభ, శాసనమండలిలో వరుసగా ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మీడియాలో వచ్చిన వార్తలను చూసి నల్లమల ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు.

# గుమ్మడిదొడ్డిలో వైద్యబృందం

### గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసిన జిల్లా వైద్యాధికారి

వాజేడు, మార్చి12: ములుగు జిల్లా వాజేడు మండలంలో 'గుమ్మడిదొడ్డికి ఏమైంది'? శీర్షికన ఈ నెల 10న 'నమస్తే తెలంగాణ'లో వార్త కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య స్పందించారు. మంగళవారం గ్రామపంచాయతీలోని గుమ్మడిదొడ్డి, ఇప్పగూడెం, సుందరయ్యకాలనీ గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. జ్వరాలు, మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. అనంతరం డీఎంహెచ్‌వో మీడియా సమావేశంలో మాట్లాడారు. గుమ్మడిదొడ్డి గ్రామంలో జ్వరాలు, మోకాళ్ల నొప్పులతో బాధపడే 70 మందికి పరీక్షలు చేసి ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. నీటి పరీక్షలు కూడా చేశామని, చాలా మందికి వైరల్ ఆర్థ్రరైటిస్‌తోనే మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని గుర్తించినట్టు చెప్పారు.

ములుగు జిల్లా గుమ్మడిదొడ్డిలో మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న వ్యక్తిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో

మెదక్ జిల్లా వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానలో విచారణ చేస్తున్న అధికారులు

# 'వరండాలో గర్భిణి ప్రసవం'పై విచారణ

వెల్దుర్తి, మార్చి 12: మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆదివారం అర్ధరాత్రి 'వరండాలో గర్భిణి ప్రసవం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారి చందూనాయక్ స్పందించారు. జిల్లా అదనపు డీఎంహెచ్‌వో విజయనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణశ్రీకి విచారణ బాధ్యతను అప్పగించారు. వారు మంగళవారం వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. రాత్రి విధుల్లో ఉన్న ఏఎన్ఎం జయంతితోపాటు దవాఖాన డాక్టర్ సౌజన్యతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరండాలో ప్రసవం జరగడానికి గల కారణాలు, విధుల్లో నిర్లక్ష్యంపై వారు ఆరా తీశారు. రాత్రివేళల్లో ఇద్దరు సిబ్బంది ఉండేలా షెడ్యూల్‌ను రూపొందించామని పేర్కొన్నారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దవాఖానలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.



నమస్తే ఎఫెక్ట్

# 'గుండారం రిజర్వాయర్'కు నీటి విడుదల

కమాన్‌పూర్, మార్చి 12: కమాన్‌పూర్‌తోపాటు రామగిరి, మంథని, ముత్తారం మండలాలకు కల్పతరువుగా ఉన్న ఈ రిజర్వాయర్‌లో సోమవారం నాటికి నీటి నిల్వలు పూర్తిగా అడుగంటాయని 'నమస్తేతెలంగాణ' ప్రధాన సంచికలో 'డెడ్ స్టోరేజీకి గుండారం రిజర్వాయర్' శీర్షికన మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా అధికార యంత్రాంగం గుండారం రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటిని నింపాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో డీ-86 కాలువకు వెళ్లే నీటి సరఫరా నిలిపివేసి ప్రత్యేకంగా గుండారం రిజర్వాయర్ కోసం డీ-83 కెనాల్‌కు మళ్లించి సాగునీటిని వదిలారు. ప్రస్తుతం గుండారం రిజర్వాయర్‌లో 10 ఫీట్లకు పైగా నీటి మట్టం చేరుకొన్నది.

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్‌లో పెరిగిన నీటి మట్టం

### నిప్పు పెట్టిన పంటల పరిశీలన

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో ఎండిపోయిన వరి పంటలకు సోమవారం ముగ్గురు రైతులు నిప్పు పెట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో మంగళవారం 'ఎండిన పంటలకు మార్పు మంటలు' శీర్షికన 'నమస్తేతెలంగాణ'లో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు గ్రామంలో నిప్పు పెట్టిన పంటలతో పాటు మిగతా రైతుల ఎండిన పంటలను సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ పరిశీలించారు. వీటిపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

-ఇల్లంతకుంట

## లోకం పోకడ




'రుణమాఫీ' ఫైలును 'రుణమాఫీ మాఫీ' అనే ఫైలులో పెట్టేస్తున్నా సార్!

### ఫార్మా విలేజ్ వద్దంటూ రైతుల ఆందోళన

వ్యవసాయ భూముల్లో ఫార్మా విలేజ్ వద్దంటూ వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచర్లకుంట తండా రైతులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముందు ఆందోళన చేపట్టారు. ప్రజావాణిలో రైతులు ప్రత్యేకాధికారి దివ్యా దేవరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. —బొంరాస్‌పేట

### దళితబంధు నిధులు విడుదల చేయాలి

దళితబంధు ఖాతాల ఫ్రీజింగ్‌ను తొలగించి, నిధులు విడుదల చేయాలని దళితబంధు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంలోని చింతకాని మండలం పలు గ్రామాలకు చెందిన సుమారు 80 మంది దళితబంధు లబ్ధిదారులు మంగళవారం స్థానిక ఎంపీడీవో ఆఫీసు వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీవో రామయ్యకు వినతిపత్రం అందజేశారు. -చింతకాని

## సాంకేతిక సంచలనం వార్ 2

సాంకేతికత ఏ స్థాయికి చేరిందంటే.. హీరోలు లేకుండానే హీరోలకు సంబంధించిన సీన్స్ తీస్తున్నారు. ఒకట్రెండు సీన్స్ కాదు.. ఏకంగా షెడ్యూల్సే చేస్తున్నారు. ప్రస్తుతం యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న సినిమా 'వార్-2'. ఇందులో హృతిక్‌రోషన్, ఎన్టీయార్ కలిసి నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే హృతిక్ షూటింగ్‌లో అడుగుపెట్టారు. షూటింగ్ మొత్తం స్టూడియోలోనే గ్రీన్‌మ్యాట్‌లో తీస్తున్నారు దర్శకుడు అయాన్ ముఖర్జీ. ఏప్రిల్ నుంచి మే చివరి వరకు తారక్‌పై సన్నివేశాల చిత్రీకరణ ఉంటుంది. విశేషమేంటంటే.. ఈ సినిమాకు సంబంధించిన రెండు భారీ ఓవర్సీస్ షెడ్యూళ్లను లీడ్ యాక్టర్స్ లేకుండానే బాడీ డబుల్స్‌తో ఇప్పటికే పూర్తి చేశారట దర్శకుడు అయాన్ ముఖర్జీ. బాడీ డబుల్స్‌తో చిత్రీకరించిన ఆ సన్నివేశాలకు అధునాతన వీఎఫ్ఎక్స్ సాంకేతికతను ఉపయోగించి ముఖాలను మార్చేయడం జరుగుతుందని యూనిట్ వర్గాల సమాచారం. పెద్దగా హీరోలకు శ్రమ నివ్వకుండా, వారి బ్రాండ్ ఇమేజ్‌ని మాత్రమే వాడుకుంటూ టెక్నాలజీతో సినిమాను పూర్తి చేయడం ఇక్కడ ఆసక్తికరమైన విషయం. యష్‌రాజ్ ఫిల్మ్స్ వారు కేవలం వీఎఫ్ఎక్స్ వర్క్ కోసమే 8 నెలలు సమయం కేటాయించినట్టు విశ్వసనీయ సమాచారం.



## చక్కనమ్మ ఎట్టకేలకు చిక్కింది

ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో 'శీలావతి' సినిమా చేస్తూ బిజీగా ఉన్న అనుష్క పనిలో పనిగా ఓ మలయాళ సినిమాను కూడా ఓకే చేసింది. సినిమా పేరు 'కథనార్ - ది వైల్డ్ సోర్సెరర్'. రోజిన్ థామస్ దర్శకుడు. రీసెంట్‌గా అనుష్క ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నది. దీనికి సంబంధించిన ఫొటోలను ఆ చిత్ర దర్శకుడు తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో పోస్ట్ చేశాడు. 'కథనార్'లో అనుష్కశెట్టి భాగమయ్యారు. ఆమెతో వర్క్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని కామెంట్ కూడా పెట్టారు. విశేషమేంటంటే.. ఈ ఫొటోలో అనుష్క లుక్ చూసి అందరు ఆశ్చర్యపోతున్నారు. కారణం ఆమె సన్నబడి చాలా అందంగా కనిపిస్తున్నారు. మళ్లీ ఒకనాటి అనుష్కలా మారిపోయారు స్వీటీ. ఇది నిజంగా ఆమె అభిమానులకు శుభవార్తే. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నది.

## స్నేహం గొప్పతనంతో..

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించారు. ఏప్రిల్ 12న విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'ఓ మై ఫ్రెండ్' అనే లిరికల్ వీడియోను సీనియర్ నటుడు శివాజీ విడుదల చేశారు. స్నేహం గొప్పతనాన్ని తెలియజెప్పే పాట ఇదని, చిత్రీకరణ సమయంలో తన మిత్రులు గుర్తుకొచ్చారని దర్శకుడు విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు.

## చిత్రం



## పంచ కళ్యాణి తీసుకొచ్చా..

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. ఏప్రిల్ 5న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'కల్యాణి వచ్చా వచ్చా..' అనే రెండో గీతాన్ని విడుదల చేశారు. పెళ్లి నేపథ్యంలో వచ్చే ఈ పాటను అనంత శ్రీరామ్ రచించగా.. మంగ్లీ, కార్తీక్ ఆలపించారు. గోపీసుందర్ స్వరాలను అందించారు. 'కల్యాణి వచ్చా వచ్చా..పంచ కల్యాణి తెచ్చా తెచ్చా..సింగారీ చెయ్యందించా..ఏనుగంబారీ సిద్ధంగుంచా..' అంటూ పెళ్లి సందడికి అద్దం పడుతూ సాగిందీ గీతం. పెళ్లి నేపథ్యంలో ఈ పాట సినిమాలో ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, రచన-దర్శకత్వం: పరశురామ్ పెట్ల.

## యాక్షన్ థ్రిల్లర్ 'శివం భజే'

అశ్విన్ బాబు హీరోగా అప్పర్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న తాజా చిత్రానికి 'శివం భజే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ ముఖ్య పాత్రను పోషిస్తున్న ఈ చిత్రంలో దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్నది. నిర్మాత మహేశ్వర్ రెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'న్యూ ఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కామెడీ, డ్రామా, థ్రిల్లర్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఇప్పటికే 80శాతం పూర్తయింది. త్వరలో విడుదల చేస్తాం' అన్నారు. కథకు సరిపోయే టైటిల్ దొరికిందని, కథలోని దైవిక కోణం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని దర్శకుడు పేర్కొన్నారు. హైపర్ ఆది, సాయిధీన, తులసి, దేవిప్రసాద్, అయ్యప్ప శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేష్, దర్శకత్వం: అప్పర్.

## మిడిల్‌క్లాస్ వారియర్ పోరాటం

'చైతన్య నాకు మంచి మిత్రుడు. వైవిధ్యమైన కథలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నాడు. ఈ సినిమాలో ఓ మిడిల్ క్లాస్ వారియర్ చేసే పోరాటాన్ని చూపించారు' అన్నారు హీరో ప్రియదర్శి. సోమవారం జరిగిన 'షరతులు వర్తిస్తాయి' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైతన్య రావు, భూమిశెట్టి జంటగా కుమారస్వామి (అక్షర) దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ..మన జీవితాల్లో జరిగిన సంఘటనలతో ఈ సినిమాను రూపొందించారని చెప్పారు. చిత్ర దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి మా అమ్మ, నాన్న చెప్పిన మాటలను మనసులో పెట్టుకొని సామాజిక బాధ్యతతో ఈ సినిమా తీశా. అందరికి నచ్చే చిత్రమిది' అన్నారు. తన క్యారెక్టర్‌కు చిరంజీవి పేరు పెట్టడంతో భయం, భక్తితో నటించానని, తన కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుందని హీరో చైతన్య రావు తెలిపారు.

## మారుతీనగర్ సుబ్రమణ్యం

స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ రావురమేశ్ హీరోగా మారారు. ఆయన కథానాయకుడిగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' పేరుతో సినిమా రానుంది. ఇంద్రజ ఇందులో కథానాయిక. లక్ష్మణ్ కార్య దర్శకుడు. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. నిర్మాణంలో ఉన్న ఈ సినిమాకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మంగళవారం వినూత్నంగా ప్రేక్షకుల ద్వారా విడుదల చేశారు. ఈ లుక్‌లో గళ్లచొక్కా, లుంగీతో మాస్ అవతారంలో కనిపిస్తున్నారు రావు రమేశ్. 'రావురమేశ్ ఇందులో కొత్తగా కనిపిస్తారు. వినోదం, భావోద్వేగాల మేళవింపుగా ఈ సినిమా ఉంటుంది. రావు రమేశ్ ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వస్తున్నది' అంటూ దర్శక, నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు. నటుడిగా తనకు ఈ స్థాయిని, స్థానాన్ని ఇచ్చిన ప్రేక్షకులే తన ఫస్ట్‌లుక్‌ని ఆవిష్కరించడం పట్ల రావు రమేశ్ సంతోషం వ్యక్తం చేశారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్, అజయ్, అన్నపూర్ణమ్మ, ప్రవీణ్ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి.

## గుప్తనిధుల కోసం విద్యావంతుల అన్వేషణ

'యూనివర్సిటీలో చదువుకున్న ముగ్గురు.. ఓ గ్రామంలో గుప్తనిధులకోసం చేసిన అన్వేషణే ప్రధానాంశంగా రూపొందిన చిత్రం 'ఓం భీమ్ బుష్'' అన్నారు దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి. 'హుషారు' సినిమాతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న హర్ష 'ఓం భీమ్ బుష్' కోసం మరోసారి మెగా ఫోన్ పట్టారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ఇందులో ప్రధానపాత్ర ధారులు. ఈ చిత్రం నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీహర్ష విలేకరులతో ముచ్చటించారు. 'గుప్త నిధుల కోసం విద్యావంతుల వెతుకులాట ఈ సినిమా. 'ఓం భీమ్ బుష్' అనేది మ్యాజికల్ పదం. చిన్న పిల్లలు ఆడుకునేటప్పుడు సరదాగా వాడే మాట. ఈ కథలో కూడా చాలా మ్యాజిక్ ఉంటుంది. పారానార్మల్ యాక్టివిటీస్, ఆత్మలు, లంకెబిందెలు ఇలాంటి మిస్టీరియస్ ఎలిమెంట్స్ ఉంటాయి. అందుకే ఈ కథకు 'ఓం భీమ్ బుష్' అనే టైటిల్ యాప్ట్' అన్నారు శ్రీహర్ష. యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న 30ఏళ్లు పైబడిన ముగ్గురు యువకులు, యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చి ఏం చేస్తారనేది ఇందులో ఆసక్తికరమైన అంశమని, ప్రతి సన్నివేశం లాజిక్‌తో ముడిపడి వుంటుందని, బలమైన కథ, కథనాలు, ఎమోషన్స్ ఇందులో ఉంటాయని, ఇలాంటి పాయింట్ ఇండియన్ స్క్రీన్‌పై రాలేదని కచ్చితంగా చెప్పగలమని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ పాట్ట చెక్కలయ్యేలా నవ్విస్తారని, చిన్నపిల్లలు ఈ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తారని, సాంకేతికంగా అన్ని విధాలా సినిమా అభినందనీయంగా ఉంటుదని, నిర్మాతల సహకారం వల్లే సినిమాను ఇంతబాగా తీయగలిగినని శ్రీహర్ష సంతోషం వ్యక్తం చేశారు.